క్లుప్తంగా

జగన్నాథునికి విశిష్ట పూజలు



దాసన్నపేట జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: స్థానిక దాసన్నపేటలో కొలువైన జగన్నాథునికి ఆలయ అర్చకులు శనివారం విశిష్ట పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో వేకువ జాము నుంచి బలభద్ర సుభద్ర సమేత జగన్నాథునికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ ఏడాది రథాయాత్ర ఉత్సవానికి సంబంధించి కొత్త రథం తయారుచేశామని, అందుకు సంబంధించి ప్రత్యేక పూజాధికాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రికార్డ్ అసిస్టెంట్‌కు సత్కారం



అప్పలనాయుడు దంపతులను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

నెల్లిమర్ల: సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన రఘుమండ అప్పలనాయుడు సేవలు వెలకట్టలేనివని ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ కొనియాడారు. అప్పలనాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా కళాశాలలో శనివారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు దంపతులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ అప్పలనాయుడు సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీవీఈఓ కేవీబీ విఠల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

నెల్లిమర్ల రూరల్: మండలంలో వల్లూరు గ్రామంలో ప్రధాన వీధిలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. మురికి కాలువలో విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని కోరుతున్నారు.

పైడితల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: స్థానిక బొగ్గులదిబ్బలో కొలువైన పైడితల్లి అమ్మవారి ఆలయ 27వ వార్షికోత్సవం శనివారం వేడుకగా ప్రారంభమైంది. వేకువజాము నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. 40వ డివిజన్ కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి అమ్మవారికి 108 ఘటాలతో నిర్వహించిన పూజా కార్యక్రమం పాల్గొని పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు రెండువేల మందికి పైగా పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెయ్యి శంకర్ రెడ్డి, వాసు, రాము, నాని, ఈశు, దినేష్, రుజుతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు అందుబాటులో ఉండాలి

భోగాపురం: మండల పరిధిలోని పింఛన్ లబ్ధిదారులకు సోమవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ జి.చంద్రకళ శనివారం తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని కోరారు.

రాజీయే రాజమార్గం



శృంగవరపుకోట: ఎస్.కోట కోర్టులో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి వాణి

- జాతీయ లోక్ అదాలత్‌లో జూనియర్ సివిల్‌జడ్జిలు విజయచంద్ర, ప్రేమలత, వాణి, కనకలక్ష్మి
- 263 కేసులు పరిష్కారం



చీపురుపల్లి: లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి ప్రేమలత



దత్తిరాజేరు: గజపతినగరం కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి కనకలక్ష్మి



కొత్తవలస: లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి విజయ్‌చంద్ర

కొత్తవలస: రాజీయే రాజమార్గమని, కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి తమ విలువైన సమయం, డబ్బును వృథా చేసుకోకుండా జాతీయ లోక్‌అదాలత్‌లలో రాజీమార్గంలో కేసులను పరిష్క రించుకోవాలని స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సముద్రాల విజయ్‌చంద్ర సూచించారు.స్థానిక కోర్టులో శనివారం మెగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా ఐపీసీ కేసులు 37, చెక్ బౌన్స్,రుణాలకు సంబంధించి 4, భార్యభర్తలకు సంబంధించి 3, సివిల్ 9, మొ త్తం 53 కేసులు రాజీమార్గంలో పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. బార్ అసోసియే షన్ ప్రెసిడెంట్ దేవి, న్యాయవాదులు డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

చీపురుపల్లి: జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ఇరువర్గాల కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత చెప్పారు. స్థానిక కోర్టు హాల్‌లో శనివారం జాతీయ లోక అదాలత్ నిర్వహించారు. రాజీపడదగ్గ 50 కేసులను పరిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదా రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలా మంది చిన్న చిన్న భేదాభిప్రాయాలు ఏర్పడి కేసులు పెట్టుకుని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతుంటారని, అలాంటి కేసులన్నీ లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని తెలిపారు. లోక్‌అదాలత్‌లో రాజీపడిన కేసులకు అప్పీల్ ఉండదన్నారు. కేసుల రాజీ ప్రక్రియలో పోలీస్, న్యాయవాదులు నుంచి పూర్తి సహాయ, సహకారా లు అందించాలన్నారు. లోక్ అదాలత్ సభ్యు లు భోగాపురపు శ్రీదేవి, రెడ్డి రమణ, టి.శ్రీదేవి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్.కోట కోర్టులో..

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్‌జడ్జి, ఎస్.కోట మండల న్యాయసేవాకమిటీ చైర్‌పర్సన్ కుమారి సబ్బవరపు వాణి అధ్యక్షతన శని వారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు.63 కేసులను రాజీమార్గంలో పరిష్కరించారు. సివిల్ కేసులు 19, చెక్ బౌన్స్ కేసులు 9, క్రిమినల్ కేసులు 33, బ్యాంక్ ప్రీలిటిగేషన్ కేసులు 2 పరిష్కరించారు. కేసు లు పరిష్కారంలో చొరవ చూపిన న్యాయవాదులు, బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులు, కక్షిదారులను న్యాయమూర్తి వాణి అభినందించారు. రాజీ అయిన సివిల్ కేసుల్లో కక్షిదారులు చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి వాపసు చేస్తామని చెప్పారు.బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరి దేముడు, బి.సత్యనారాయణ, ఏపీపీ పి.కేశవరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గజపతినగరం కోర్టులో..

దత్తిరాజేరు: గజపతినగరం కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్, క్రిమినల్, బ్యాంకు లిటిగే షన్ తదితర 97 కేసులను రాజీమార్గంలో పరిష్కరించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలకు ఒకరిపై ఒకరు కేసులు పెట్టకొని పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తున్న సీఐ బి.వెంకటరావు

- యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి
- వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, బాగా చదుకుని జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సూచించారు. జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో పట్టణంలోని అపెక్స్ జూనియర్ కళాశాలలో విముక్తి స్వచ్ఛంద సంస్థ సహకారంతో కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యువత మత్తుపదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ప్రజలెవరూ మాదకద్రవ్యాల జోలికి పోవద్దని, మద్యపానానికి, దూమపానానికి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మత్తుపదార్థలకు బానిసైన వారు శారీరక రుగ్మతలకులోనై, జ్ఞాపక శక్తి, విచక్షణ, విజ్ఞత కోల్పోయి, నేరాలకు పాల్పడుతూ నిందితులుగా మారి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. చెడు సహవాసాలతో, వ్యసనాలకు యువత బానిసై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. మత్తుపదార్థాల విక్రయం, రవాణా, వినియోగంపై డయల్ 100 లేదా టాస్క్‌ఫోర్స్ సీఐ 9121109416కి సమాచారం అందించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో ఎవరైనా యువత ఒకసారి చిక్కుకుని, అరెస్టయితే ఇక వారి భవిష్యత్తు నాశనమైనట్టేనన్నారు. నేరం రుజువైతే పదేళ్లకు పైబడి జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ భార్గవ్, విముక్తి సంస్థ ప్రతినిధులు కాశీప్రసాద్, ఎన్.చంద్ర, ఎస్ఐ నవీన్‌పడాల్, అపెక్స్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి

పూసపాటిరేగ: ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొని ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్‌కుమార్ బెహరా అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలి అనే అంశంపై కార్యదర్శులు, సిబ్బంది, వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు, భూకంపాలు, తుఫాన్లు, వరదలు సంభవించినప్పుడు ప్రమాద ఉధృతి పెరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్నవారిని రక్షించి వారికి మనోధైర్యం ఇవ్వాలని సూచించారు. అవగాహన, అప్రమత్తతతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ, ఎంపీడీఓ ఎం.రాధిక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, అగ్నిమాపక శాఖ ప్రతినిధి గణేష్‌కుమార్, సర్పంచ్ టి.సీతారాం, ఎంపీటీసీ పి.లక్ష్మినాయుడుతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

విజయనగరం అర్బన్: గ్రంథాయ ఉద్యమకారుడు జయంతి రామలక్ష్మణ మూర్తి జయంతిని పురస్కరించుకొని 'గ్రంథాలయాల ఆవశ్యకత' అనే అంశంపై పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు జిల్లా గ్రంథాయ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేడిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలో తలపడ్డారు. ఈ సందర్భంగా సేవా సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ మాట్లాడుతూ.. జూలై 1వ తేదీన గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాయలంలో రామలక్ష్మణ మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, అధ్యాపకులు, బోధనేతర, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ వినియోగంపై అవగాహన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట గ్రామంలో రైతులకు డ్రమ్ సీడర్ సాయంతో వరి నట్లు వేసే విధానంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ డ్రమ్ సీడింగ్ పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రేగాన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రాంబార్కి రామారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పక్కాగా చేపట్టాలి

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జూలై 1న పింఛన్ల పంపిణీ పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ గిడుతూరి రామారావు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు పంపిణీ చేయాలన్నారు. శత శాతం పింఛన్లు పంపిణీ జరిగేలా చూడాలన్నారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు నేటితో గడువు పూర్తి

విజయనగరం: 2024–25 మొదటి ఆర్థిక ఆర్థ సంవత్సరానికి సంబంధించి వడ్డీ లేకుండా ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లించేందుకు ఈనెల 30తో గడువు ముగియనున్నట్లు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎంఎం నాయుడు శనివారం తెలిపారు. ఆదివారం కార్యాలయానికి సెలవు దినం అయినప్పటికీ పన్నులు చెల్లించేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్లు తెరిచి ఉంటాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన

చీపురుపల్లి: ప్రస్తుతం డిజిటల్ అక్షరాస్యత ఆవశ్యకత బాగా పెరిగిందని, విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని రాజాం జీఎంఆర్ ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అన్నారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్ర మంలో భాగంగా ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్థానిక బాలికోన్నత పాఠశా లలో విద్యార్థినిలకు డిజిటల్ అక్షరాస్యతపై శనివా రం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు డిజిటల్ అక్షరాస్యతపై చాలా సవాళ్లు ఎదుర్కొంటు న్నట్లు చెప్పారు. కంప్యూటర్లు, ఇంటర్నెట్ తదితర సదుపాయా లు లేక డిజిటల్ అక్షరాస్యతకు దూరమవుతున్న సందర్భాలు ఉన్నాయన్నారు. అయిన ప్పటికీ ప్రస్తుతం ఉన్న వనరులను వినియోగించుకుని, ప్రత్యేక శ్రద్ధతో కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. డిజిటల్ అక్షరాస్యత ప్రోగ్రామ్స్, ఆన్‌లైన్, కంప్యూటర్ ఎయిడెడ్ లెర్నింగ్ వంటి అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి బహుమతు లు అందజేశారు. ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ, పాఠశాల హెచ్‌ఎం రహీనాబేగం, జీఎంఆర్ ఐటీ విద్యార్థులు రాహుల్, సంతోష్, వంశీ, సూర్యప్రకాష్, మహేంద్ర తదితరులు పాల్గొన్నార్చు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

లక్కవరపుకోట: మల్లివీడు ప్రాథమిక పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన అమనాపు శరణకుమార్ తన తల్లి జ్ఞాపకార్థం పెన్నులు, నోట్ పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఎంపీపీ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ శరణకుమార్ తల్లి గతంలో రోడ్డు ప్రమాదంలో మరణించారని, ఆమె జ్ఞాపకార్థం విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. స్థానికులు కటపల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి



పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి

భోగాపురం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి సూచించారు. ఇంటి పరిసరాల్లో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమకాటు వల్ల చికెన్‌గున్యా, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, కాబట్టి దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలని సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాలని సూచించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు



ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్లు

విజయనగరం: ప్రజా హితాన్ని కాంక్షించి అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషిచేసి మెరుగైన పౌరసేవలు అందించాలని స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. శనివారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయానికి విచ్చేసిన ఆమె అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చులయాదవ్, కమిషనర్ ఎం.ఎం.నాయుడు, సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందించారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2019 ఎన్నికలకు ముందు ప్రారంభించి నిలిచిపోయిన ప్రాజెక్టులపై ఆరా తీశారు. అనంతరం జూలై ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న 'స్టాప్ డయేరియా' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సిబ్బంది అధికారులు మంచి సేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా నగరంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాను మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను పరిగణలోకి తీసుకొని శతశాతం అమలయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె.శ్రీనివాసరావు, ఏసీపీలు మధుసూదనరావు, అమ్మాజీరావు, డీఈలు, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో తుఫాన్ షెల్టర్

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామంలో మత్స్యకారుల సౌకర్యార్థం నిర్మించిన తుఫాన్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్ సమయంలో మత్స్యకారులను సురక్షితంగా తలదాచుకునేందుకు ఈ షెల్టర్లు ఎంతగానో ఉపయోగపడేవి. మిగతా సమయంలో స్థానికుల సామాజిక అవసరాలు, సమావేశాల నిర్వహణకు ఈ షెల్టర్లను వినియోగించుకునేవారు. ప్రతి వారం డ్వాక్రా మహిళలు ఈ షెల్టర్‌లోనే సమావేశాలు నిర్వహించేవారు. అయితే ప్రస్తుతం ఈ తుఫాను షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు అటుగా వెళ్లేందుకు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి శిథిల భవనాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నారు.




ముక్కాంలో శిథిలావస్థకు చేరిన తుఫాన్ షెల్టర్

శ్రీరాంపురంలో వైద్యశిబిరం

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో ఎల్.కోట పీహెచ్‌సీ వైద్యసిబ్బంది శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా శిబిరంలో 42 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్యతనిఖీలు చేసి మందులు అందజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు,బరువు కొలిచి, వైద్యపరీక్షలు చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



బొండపల్లి: దేవుపల్లిలో పూజలందుకుంటున్న రాజరాజేశ్వరీదేవి అమ్మవారు



జామి: పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం గ్రామంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వ హించారు. అర్చకులు ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపారు. అనంతరం మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

జామి: పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు రవి ఆధ్వర్యంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశా రు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



లక్కవరపుకోట: రంగరాయపురం శివాలయంలో శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న దంపతులు

రాజరాజేశ్వరీదేవి ఆలయంలో..

బొండపల్లి: కాలాష్టమి సందర్భంగా దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి శనివారం అభిషే కాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మ వారికి మొక్కులు చెల్లించుకున్నారు.నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నప్రసాదం అందించారు.